ఓ వంట కథ

''రండి. ఇప్పటికే భోజనానికి ఆలస్యమయింది'' అంటూ పిలిచింది జానకి.

రఘు పెదవుల మీద సన్నని మందహాసం మెరిసింది. భార్యను చూడగానే తాను చేసిన తప్పు గ్రహించి, నవ్వు బిగించి గంభీరంగా వంటింట్లోకి నడిచాడు. జానకికి ఉడుకుమోత్తనంతోపాటు కోపం గూడా వచ్చింది.

''భోజనం అనగానే అంత నవ్వు ఎందుకొస్తుందో అయ్యగారికి'' అంది చురచుర చూస్తూ.

''ఏమిటీ?'' అన్నాడు రఘు, వేదాంతిలా శూన్యం లోకి చూస్తూ.

''మీ వేషాలన్నీ నాకు తెలుసులెండి. నేను భోజనానికి రమ్మనగానే మీకు చాలా నేచురల్‌గా నవ్వు వస్తుంది. నేను అడిగేసరికి సీరియస్‌గా ముఖం పెట్టి దాన్ని దాచిపెడదామని చూస్తారు'' అంది రుసరుసలాడుతూ.

''ఛ ... ఛ ... అదేమీ లేదు. నేను ఇవాళ జీవితం గురించి చాలా తీవ్రంగా ఆలోచిస్తున్నాను. నవ్వు ఎక్కణ్ణుంచి వస్తుంది?'' అంటూ మరింత గంభీరంగా వంటింట్లోకి నడిచేడు.

కోపంతో మండిపోతున్న జానకి భోజనం వడ్డించింది. కంచంలో కొంచెం నల్లగా ఉన్న పదార్థాన్ని చూపిస్తూ, ''ఇదేం కూర?'' అనడిగాడు రఘు.

కోపంగా చూస్తున్న భార్యను చూసి తడబడుతూ, ''చూడు, డార్లింగ్. మంచి 'ఫిలాసఫర్' కావాలంటే పరిశీలనా శక్తి, హేతుబద్ధమయిన ఆలోచనా సరళి కలిగి ఉండాలి. 'అరిస్టాటిల్' అంత గొప్పవాడు ఎలా అయాడో తెలుసా? అవకాయ గురించి ఒక సారి ఆలోచిస్తూ ఉంటే, ఉన్నట్టుండి ఆయనకు 'ఎన్‌లైటెన్‌మెంట్' కలిగి ప్రపంచమంతటా కీర్తి పొందాడు.''

జానకి వస్తున్న నవ్వు బలవంతంగా అదుముకుంటూ ''ఈ సొదంతా ఎందుకు! అది బెండకాయ కూర'' అని అన్నది.

''పాపం! బెండకాయలు ఎప్పుడూ ఆకుపచ్చగా ఉంటాయి. ఆకురాలే కాలంలో కుక్కమూతి పిందెలు పడ్డట్టు, కలికాలం గదా! నలుపులో బెండకాయలు పుడుతున్నాయి గావాలు. అదుగో ... నువ్వలా కోపంగా చూడకు. అసలు న్యూటన్ పరిణామవాదం ప్రకారం ...''

''ఇహ నోరు ముయ్యండి. ఎక్కువ మాట్లాడితే మీకు బి. ఎస్‌సి. డిగ్రీ ఇచ్చిన యూనివర్సిటీ మీద దావా వేస్తాను.''

''పోనీ పైథాగరస్ చెప్పిన పరిణామవాదం గురించి మాట్లాడదామా?''

. . . . . .

''నువ్వలా హంతకుణ్ణి చూసినట్లు మొహం పెట్టకు. నీ కిష్టం లేకపోతే సాహిత్యం గురించి మాట్లాడదాం.''

''ఈ డొంకతిరుగుడంతా ఎందుకు? కూర మాడిందని చెప్పచ్చుగా!'' నీకు ధైర్యం లేదన్నట్లుగా స్పందించేట్లు అంది జానకి.

''ఏం? నాకు భయమనుకున్నావా? కూర మాడి బొగ్గులా ఉంది. ఇంకా ... తగలడ్డట్టుంది.'' రెచ్చిపోయి ఏమనాలో తెలీక అరిచాడు రఘు.

''హమ్మో! చూశారా! అననే అన్నారు. నన్ను ఇంత ఇన్సల్ట్ చేసి మాట్లాడతారా? ఇహ ఇక్కడ ఒక్క క్షణం కూడా ఉండను.'' ప్రయాణమయింది జానకి, పుట్టింటికి.

అర్ధరాత్రి ఒంటిగంటకు తలుపు దబదబ శబ్దమయ్యేసరికి, ''తలుపు తియ్యండి. పాపం, మీ 'కంప్రెషన్ సెక్షన్'లో 'టాబ్లెట్ పంచింగ్ మెషిన్' నొప్పులు పడుతున్నట్లు పిలుపు వచ్చి ఉంటుంది'' అంది వెక్కిరింతగా దుర్గ.

''అర్ధరాత్రి ఒంటిగంటకు కూడా నీ సెన్స్ ఆఫ్ హ్యూమర్ తగ్గదు గదా! ఇటువంటి జోకులు వెయ్యకు. అదే నిజమయితే ఇంకో రెండు రోజులు నేను ఫాక్టరీలో కాపురం పెట్టడం ఖాయం'' అని బద్ధకంగా ఆవులించి లేచాడు. తలుపు తీసి ద్వారంలో నిల్చున్న మనిషిని చూడగానే, ''అరె! నువ్వట్రా ... ఇలా అర్ధరాత్రి హఠాత్తుగా ...'' మాట పూర్తయ్యే లోపల ... ''నేనేలే కాని, నువ్వు అర్జెంటుగా బయట వరండాలోకి వెళ్ళు. నేను, వదిన కొన్ని 'కాన్ఫిడెన్షియల్' విషయాలు మాట్లాడుకోవాలి'' అంటూ లోపలికి వచ్చాడు రఘు. చలపతి ఆశ్చర్యంగా చూస్తూ వరండాలోకి వెళ్ళాడు.

కథ అంతా విని, ''అయితే ఇంతా జరిగిన తర్వాత ఆమె కాకినాడ బస్సెక్కి పుట్టింటి కెళ్ళింది. నువ్వు ఇలా వచ్చావు—అవునా'' అంది దుర్గ.

అవునన్నట్లు తలూపాడు రఘు.

''అయినా నువ్వు ఉత్త ఫూల్‌వి, రఘూ'' అంది దుర్గ సీరియస్‌గా.

''ఇది నీకు ఎప్పుడో తెలుసుగదా, వదినా'' అన్నాడు రఘు వినయంగా.

''నాకు తెలుసు. నువు నా దగ్గ రున్నప్పుడు నేను ఆ విషయం రోజూ నీకు గుర్తు చేసేదాన్ని. ఏ విషయం?''

''నేను ఫూల్‌నన్న విషయం.'' అందించాడు.

''పెళ్ళికాగానే నువ్వా విషయం మరిచిపోయి పెద్ద మగ మహారాజులా ప్రవర్తించి సంసారంలో గొడవలు తెచ్చుకున్నావు. సరే, జరిగిందేదో జరిగిపోయింది. ఈ చిక్కు ముడి నే విప్పుతాను. రేపు సాయంత్రానికల్లా జానకి హైదరాబాద్ చేరుతుంది. కాని, ఇక నువ్వు కాస్త తెలివిగా ప్రవర్తించాలి. ఆడదానికి పొగడ్తలంటే మక్కువ. దట్ టూ వంట విషయంలో గనక పొగిడావంటే మరీను. జీవితాంతం వంట మనిషి పని అద్భుతంగా నిర్వహిస్తుంది. కాబట్టి కాస్త పొగుడుతూ ఉండాలి. అర్థమయిందా!''

''అయింది వదినా'' అన్నాడు రఘు ఉత్సాహంగా.

''అయితే ఇహ బస్సెక్కు. రెండు గంటలకు హైదరాబాదు వెళ్ళే ప్రైవేట్ లగ్జరీ బస్సు లుంటాయి. బెస్ట్ ఆఫ్ లక్'' అని దుప్పటి తలవరకూ లాక్కుంది దుర్గ.

''థాంక్యూ, వదినా'' అంటూ రఘు హుషారుగా బయటకు నడిచాడు.

• • •

ఆశ్చర్యంతో తలమునక లయిపోయాడు రఘు.

''ఆహా! ఏమి నా భాగ్యము! వంకాయకూర, కొబ్బరి పచ్చడి ... చాల్చాలు ... నా జీవితం ధన్యమయిపోయింది. ఒక్క రోజులో ఎంత అభివృద్ధి సాధించావు! అయ్యో... మీ రలా చూస్తున్నారేమిటి? భోజనం చెయ్యండి'' అన్నాడు ఎదురుగా కూర్చున్న సరళను చూసి. ఆమె ముసిముసి నవ్వులు నవ్వుతూ భోజనానికి ఉపక్రమించింది. జానకి కళ్ళు పెద్దవి చేసుకొని గంభీరంగా చూస్తోంది కాని మాట్లాడ్డంలేదు.

ఆఫీసుకు వెళుతూ—''జానీ! ఇహ నేనేం చెప్పను! నలుడు, వలలుడు మొదలైన వాళ్ళు నీ తమ్ముళ్ళయిపోయా రనుకో'' అన్నాడు రఘు తృప్తిగా.

• • •

సాయంత్రం రఘు వచ్చేసరికి ... ''అంకుల్! ఆంటీ ఇది మీ కిమ్మన్నారు'' అంటూ తాళం చెవి, ఒక మడత పెట్టిన చీటీ ఇచ్చాడు ప్రక్కింటి కుర్రాడు. కాగితం మడత విప్పి కుతూహలంగా ఈల వేస్తూ చదవసాగాడు.

''డియర్ రఘూ!

నా కిప్పుడు బాగా అర్థమయింది. అక్కయ్యగారు నచ్చ చెబితే నీవు మారి ఉంటావన్న ఆశతో తిరిగి నీ దగ్గర కొచ్చాను. తేలిందేమిటంటే, నీకు భార్యకాదు కావలసింది. మంచి వంట మనిషి. ఇక జన్మలో నీతో సంసారం చేసే ఆలోచనను మనసులో రానివ్వనని ప్రమాణం చేస్తున్నాను.

ఇట్లు,
—జానకి.''

పి. ఎస్ : ప్రొద్దున వంటచేసింది నేను కాదు—నా స్నేహితురాలు సరళ.

రఘుకు కళ్ళు బైర్లు కమ్మాయి. ఎదురుగా అభయ హస్త మిస్తున్నట్లు వదిన కనుపించింది. ఆదరా బాదరాగా రిక్షా ఎక్కి ''బస్‌స్టాండ్'' అన్నాడు.

- నారపరాజు రాఘవరావు